సాక్షి ఖమ్మం

శనివారం । 5 । ఏప్రిల్ । 2025



మనోళ్లే.. ఇచ్చేయండి..

కేఎంసీలో కొందరు అధికారులు ఒకరిద్దరు కాంట్రాక్టర్లకే నామినేషన్ పద్ధతిపై పనులు అప్పగిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. 8లో



రహదారి విస్తరణకు...

ఖమ్మం రామన్నపేటలో రోడ్డు విస్తరణ కోసం అడ్డుగా ఉన్న ఇళ్ల కూల్చివేత చేపట్టడంతో ఉద్రిక్తత నెలకొంది. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
39° / 23°

వాతావరణం

జిల్లాలో శనివారం ఎండ ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చు. మధ్యాహ్నం ఉష్ణోగ్రత పెరిగినా సాయంత్రానికి చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

శిక్షణ శిబిరాల నిర్వహణకు దరఖాస్తులు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యాన వేసవిలో క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు ఆసక్తి ఉన్న సీనియర్ క్రీడాకారులు, పీడీలు, పీఈటీలు ఈనెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో శిక్షణా శిబిరాల ఏర్పాటుపై దృష్టి సారించగా, ఆసక్తి కలిగిన వారు ముందుకు రావాలని తెలిపారు. నిర్వాహకులకు గౌరవ వేతనంగా రూ.4వేలు చెల్లిస్తామని, దరఖాస్తులను ఖమ్మం పటేల్ స్టేడియంలోని తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

హెచ్‌సీ కుటుంబానికి భద్రతా పరిహారం చెక్కు



చెక్కు అందిస్తున్న సీపీ

ఖమ్మంక్రైం: ఖమ్మం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ ఇటీవల మృతి చెందిన హెడ్‌కానిస్టేబుల్ పాపా కుటుంబానికి రూ.8లక్షల భద్రతా పరిహారం మంజూరైంది. ఈ సందర్భంగా చెక్కును సీపీ సునీల్‌దత్ శుక్రవారం అందజేసి మాట్లాడారు. శాఖాపరంగా కుటుంబానికి అండగా నిలుస్తామని తెలిపారు.

మెడికల్ కాలేజీకి 29 మంది ఎస్‌ఆర్‌లు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీకి 29 మంది సీనియర్ రెసిడెంట్లను కేటాయించారు. ఇటీవల పీజీ పూర్తి చేసిన వీరు ఏడాది పాటు వైద్యసేవలు అందించనుండగా, ఇప్పటికే 26 మంది విధుల్లో చేరారు. అనస్తీసియా, జనరల్ సర్జరీ విభాగాల్లో ముగ్గురు చొప్పున, రేడియో డయాగ్నసిస్, ఆప్తమాలజీ, పాథాలజీ, పీడియాట్రిక్స్, గైనిక్, జనరల్ మెడిసిన్ విభాగాల్లో ఇద్దరు చొప్పున, రెస్పిరేటర్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్, ఫార్మకాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, పిజియాట్రిక్, మైక్రోబయాలజీ, ఈఎన్‌టీ, డెర్మటాలజీ విభాగాల్లో ఒక్కొక్కరు చొప్పున విధుల్లో చేరారు. ఆస్పత్రిలో వైద్యుల కొరత నేపథ్యాన ఎస్‌ఆర్‌ల కేటాయింపుతో వైద్యసేవల్లో ఇబ్బందులు తొలగనున్నాయి.

విద్యుత్ సరఫరాను పరిశీలించిన సీఈ



నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న సీఈ, అధికారులు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్రంలో విద్యుత్ సరఫరా తీరుతెన్నులు, సబ్‌స్టేషన్లలో అభివృద్ధి పనులను ఎన్పీడీసీఎల్ సీఈ రాజుచౌహాన్ శుక్రవారం పరిశీలించారు. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి సబ్ స్టేషన్‌లో రూ.1.10 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసే 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించిన ఆయన ఖిలా ఏరియాలో రూ.15 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన రెండు 160 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ వేసవిలో ఎంత డిమాండ్ పెరిగినా మెరుగైన విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అకాల వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యాన ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలి సూచించారు. ఎస్‌ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి, డీఈ నంబూరి రామారావు, ఏడీఈలు నాగార్జున, యాదగిరి, ఏఈలు పాల్గొన్నారు.

మక్కల కొనుగోళ్లు ప్రారంభం



కొనుగోళ్లను ప్రారంభిస్తున్న మేనేజర్, తదితరులు

చింతకాని: మొక్కజొన్నలకు మద్దతు ధర దక్కేలా మార్క్‌ఫెడ్ ఆధ్వర్యాన కొనుగోళ్లు ప్రారంభించారు. ఈసందర్భంగా చింతకానిలో ఏర్పాటుచేసిన కేంద్రాన్ని శుక్రవారం మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ సునీత ప్రారంభించి మాట్లాడారు. దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మక్కలు విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. తేమ 14శాతంలోపు ఉన్న మొక్కజొన్నలు క్వింటాకు రూ.2,225 మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. తహసీల్దార్ కె.అనంత రాజు, ఏఓ మానస, సొసైటీ చైర్మన్, వైస్‌చైర్మన్లు కె.శేఖర్‌రెడ్డి, ఎం.రవి, సీఈఓ శ్రీనివాసరావు, ఆత్మ కమిటీ డైరక్టర్ కె.గోవిందరావుతో పాటు కోటేశ్వరరావు, మనోహర్‌బాబు, కోటయ్య, వెంకటేశ్వర్లు, గోపి పాల్గొన్నారు.

ఆగం చేసిన అకాల వర్షం

> **అప్రమత్తంగా ఉండాలి...**
> అకాల వర్షాలతో జిల్లాలో పంట నష్టం జరగలేదు. అయినప్పటికీ రైతులు వాతావరణాన్ని ఎప్పటికప్పుడు గమనిస్తూ తగిన జాగ్రత్తలు పాటించాలి. పంటలను రక్షించుకునే విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి.
> – ధనసరి పుల్లయ్య, డీఏఓ



కల్లూరు మండలం బత్తులపల్లిలో నేలకొరిగిన వరి పంట



ఏన్కూరు మార్కెట్‌యార్డులో తడిసిన మొక్కజొన్న కంకులు

పంటలు చేతికందే దశలో అకాల వర్షం

- నేలవాలిన వరి, మొక్కజొన్న, రాలిన మామిడి
- ధాన్యం, మక్కలు, మిర్చి తడవడంతో రైతుల ఆందోళన

ఖమ్మంవ్యవసాయం: అకాల వర్షం పంటలను ఆగం చేస్తోంది. యాసంగిలో సాగు చేసిన పలు పంటలు చేతికందే దశలో ఉండగా.. గురువారం అర్ధ రాత్రి, శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షంతో పలు చోట్ల దెబ్బతిన్నాయి. గురువారం రాత్రి 12:45 గంటల సమయం నుంచి వర్షప్రభావం జిల్లాలో ప్రారంభమైంది. శుక్రవారం ఉదయానికి జిల్లాలో సగటు వర్షపాతం 13.9 మి.మీ.గా నమోదైంది. కామేపల్లి మండలంలో భారీ వర్షం కురవగా, పెనుబల్లి, సింగరేణి, కల్లూరు, తల్లాడ, సత్తుపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈదురుగాలులు, అకాల వర్షాలతో కోత దశలో ఉన్న వరి, మొక్కజొన్న వంటి పంటలు నేలవాలగా.. మామిడి కాయలు రాలిపోయాయి. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం, మొక్కజొన్న, మిర్చి పంటలు తడిశాయి. దీంతో రైతులు పంటలను రాశులుగా చేర్చి టార్పాలిన్లతో రక్షణ కల్పిస్తున్నారు.

ప్రతికూల వాతావరణం

జలాశయాల్లో సమృద్ధిగా నీరు ఉండడం, ప్రాజెక్టుల నుంచి నీరు విడుదల చేయగా ఈ ఏడాది యాసంగిలో జిల్లా రైతులు 3.53 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఇందులో వరి 2.25 లక్షల ఎకరాల్లో, మొక్కజొన్న 1.15 లక్షల ఎకరాలు ఉంది. సత్తుపల్లి, కూసుమంచి వ్యవసాయ డివిజన్లలో వరి పంట చేతికందుతుండగా, మధిర, కూసుమంచి, ఖమ్మం, వైరా డివిజన్లలో మొక్కజొన్న కోతలు ప్రారంభమయ్యాయి. వీటికి తోడు వానాకాలంలో సాగు చేసిన మిర్చి పంట కోతలు చివరి దశకు చేరాయి. ధాన్యం, మొక్కజొన్న, మిర్చి పంటలను రైతులు కల్లాల్లో ఆరబెట్టిన నేపథ్యాన వర్షంతో నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయి.

అన్నదాతల్లో ఆందోళన

పంటలు చేతికందుతున్న సమయాన అకాల వర్షాలు కురవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ప్రభుత్వం ఓ వైపు ధాన్యం, మొక్కజొన్న కొనుగోలుకు కేంద్రాల ఏర్పాటు చేస్తోంది. దీంతో రైతులు పంట కోతలను ముమ్మరం చేసి కల్లాల్లో ఆరబెట్టారు. ఇప్పుడు వర్షం కారణంగా పలుచోట్ల వరి చేన్లు నేలవాలగా, మొక్కజొన్నలు, మిర్చి తడిసిపోయాయి. దీంతో రైతులు శుక్రవారం ఉదయం నుంచి నీరు తొలగిస్తూ పంటలు ఎండబెట్టుకోవడంలో నిమగ్నయ్యారు. అయితే, శుక్రవారం సాయంత్రం కూడా తిరుమలాయపాలెం తదితర ప్రాంతాల్లో వర్షం కురవగా.. ఇంకా ఆకాశం మేఘావృతమై ఉండడంతో రైతులు కుటుంబాలతో సహా కల్లాల వద్దకు చేరుకుని పంట ఉత్పత్తులపై టార్పాలిన్లు కప్పుతున్నారు.

జిల్లాలోని కొన్ని మండలాల్లో వర్షపాతం వివరాలు.. (మి.మీలు)	కామేపల్లి	పెనుబల్లి	సింగరేణి	కల్లూరు	తల్లాడ	సత్తుపల్లి	ఏన్కూరు
	62.2	57.4	57.2	35.8	31.2	15.4	14.6

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



మత్స్యకారులకు వలలు అందజేస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి: మత్స్యకారులకు ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో 50మంది మత్స్యకారులకు వలలు, చేపలు పట్టే సామగ్రిని ఆయన పంపిణీ చేశారు. పాలేరులోని మత్స్య పరిశోధనా కేంద్రంలో శిక్షణ పొందిన మత్స్యకారులకు న్యూఢిల్లీలోని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి ఆర్థిక సహకారంతో వీటిని సమకూర్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మత్స్యరంగంలో రాష్ట్రాన్ని ముందంజలో నిలిపేలా ప్రభుత్వం ఇస్తున్న శిక్షణ, చేయూతను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆతర్వాత పలువురు దివ్యాంగులకు త్రీ వీలర్ మోపెడ్ వాహనాలను మంత్రి అందజేశారు. అంతేకాక సబ్ స్టేషన్ ఆవరణలో రూ.35 లక్షలతో నిర్మించే కార్యాలయ భవనానికి శంకుస్థాపన చేశారు.

అభివృద్ధి.. సంక్షేమం

నేలకొండపల్లి: అభివృద్ధి పనులు చేపడుతూనే సంక్షేమ పథకాలు నిరాటంకంగా సాగిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. నేలకొండపల్లి మండలం కట్టుకాచారంలో బీటీ రోడ్డు శంకుస్థాపన చేసిన మంత్రి, బోదులబండలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడంతో అనంతనగర్‌లో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వం అప్పుల భారాన్ని మోపితే వడ్డీలు కడుతూనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమాల్లో ఎన్పీడీసీఎల్ సీఈ రాజుచౌహాన్, ఎస్‌ఈ శ్రీనివాసాచారి, ఆర్డీఓ నర్సింహారావు, జిల్లా మత్స్య శాఖ అధికారి శివప్రసాద్, డీఏఓ పుల్లయ్య, పౌర సరఫరా సంస్థ మేనేజర్ శ్రీలత, పాలేరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్, తహసీల్దార్ కరుణశ్రీ, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, పాలేరు మత్స్య పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త శ్యాంప్రసాద్, మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములుతో పాటు వి.రమ్య, భద్రయ్య, కొడాలి గోవిందరావు, బచ్చలకూరి నాగరాజు, రాయపూడి నవీన్, బొందయ్య, జెర్రిపోతుల సత్యనారాయణ, గుండా బ్రహ్మం, కడియాల నరేష్, బోయిన వేణు, బొర్రా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పైనంపల్లి కార్యదర్శిపై సీరియస్

నేలకొండపల్లి మండలం పైనంపల్లి పంచాయతీ కార్యదర్శి ఎస్.నరసింహారావుపై రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని, కార్యదర్శి అందుబాటులో ఉండడం లేదని స్థానికులు ఫిర్యాదు చేయగా కార్యదర్శిని పిలిపించిన మంత్రి మందలించారు. ఆయనను సస్పెండ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయమై ఎంపీడీఓ ఎం.ఎర్రయ్యను వివరణ కోరగా కార్యదర్శిని డీపీఓ కార్యాలయానికి సరెండర్ చేశామని తెలిపారు.

అన్ని గురుకులాలు ఒకేచోట..



గురుకులం ఉద్యోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

'ఇంటిగ్రేటెడ్' స్థల పరిశీలనలో కలెక్టర్

వైరా: నియోజకవర్గ కేంద్రాల్లో ఇంటిగ్రేటెడ్ గురుకులాల నిర్మాణంతో విద్యార్థులకు మెరుగైన బోధన అందుతుందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు.వైరాలోని కేవీసీఎం డిగ్రీ కళాశాల, గురుకుల పాఠశాల ప్రాంగణాలను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇంటిగ్రేడెట్ గురుకుల భవనాలు ఎక్కడ నిర్మించాలనే అంశంపై స్థలాల పరిశీలన చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాంగణాల్లో బాలురు, బాలికలకు విడివిడిగా భవనాలు నిర్మిస్తామని, నెలలోగా స్పష్టత వస్తుందని చెప్పారు. అనంతరం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రమతో మాట్లాడిన కలెక్టర్ పదో తరగతి విద్యార్థినులు పరీక్షలు ఎలా రాశారో ఆరాతీయడమే కాక ఫలితాలు వచ్చాక ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను కలెక్టరేట్‌కు తీసుకురావాలని సూచించారు. ఆర్‌డీఓ నరసింహారావు, తహసీల్దార్ కే.వీ.శ్రీనివాస్, ఆర్‌ఐలు శ్రీకాంత్, విక్రమ్ ఉన్నారు.

సన్న బియ్యం రవాణాలో వేగం

ఖమ్మం సహకారనగర్: జిల్లాల్లోని అన్నిరేషన్ షాపులకు సన్న బియ్యం త్వరగా చేరవేసి పంపిణీలో జాప్యం జరగకుండా చూడాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి శుక్రవారం ఆయన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో కలిసి వివిధ అంశాలపై కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రేషన్‌షాపుల్లో ఇన్నాళ్లు దొడ్డు బియ్యం సరఫరా చేసినా చాలా మంది తీసుకోలేదన్నారు. దీంతో ఉచితంగా సన్న బియ్యం సరఫరాకు నిర్ణయించామని తెలిపారు. ఈమేరకు రవాణా కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించి త్వరగా షాపులకు చేర్చడంతో పాటు సరఫరాలో అక్రమాలు జరగకుండా చూడాలని సూచించారు. అనంతరం సీఎస్ మాట్లాడుతూ షాప్‌ల వద్ద రద్దీ దృష్ట్యా అవసరమైన బియ్యం సమకూర్చాలని, నూతన రేషన్ కార్డుల దరఖాస్తుల పరిశీలనలో పెంచాలని తెలిపారు. ఈ వీసీకి జిల్లా నుంచి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్‌కుమార్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జి.శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

కమనీయం... శ్రీవారి కల్యాణం



జమలాపురంలో తిలకించి పులకించిన భక్తజనం



శ్రీవారి కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు (ఇన్‌సెట్) పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పిస్తున్న ఆలయ ఈఓ, అర్చకులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీవేంకటేశ్వరస్వామి సమేత అలివేలు మంగ, పద్మావతి అమ్మవార్ల కల్యాణం జరిపించారు. ఇటీవల నిర్మించిన వకుళామాత స్టేడియానికి శ్రీవారు, అమ్మవార్ల ఉత్సవమూర్తులను తోడ్కొని వచ్చిన అర్చకులు పట్టువస్త్రాలతో అలంకరించాక కల్యాణ క్రతువు ఆరంభించారు. ఈక్రమాన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయం నుంచి తీసుకొచ్చిన ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలను ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు దంపతులు సమర్పించగా, గ్రామపంచాయతీ అధికారులు, తుళ్లూరు కోటేశ్వరరావు దంపతులు సైతం నూతన వస్త్రాలు, తలంబ్రాలను సమర్పించారు. అనంతరం ప్రధాన, ముఖ్య అర్చకులు పురాణం రవికుమార్‌శర్మ, ఉప్పల శ్రీనివాసశర్మ, మురళీమోహన్‌శర్మ, రాజీవ్‌శర్మ తదితరుల నేతృత్వాన మధ్యాహ్నం 12–01 గంటలకు అభిజిత్ లగ్నంలో స్వామి కల్యాణ తంతు పూర్తిచేశారు. ఈసందర్భంగా స్టేడియం ప్రాంగణం గోవింద నామ స్మరణతో మార్మోగింది. అలాగే, గ్రామోత్సవం అనంతరం స్టేడియం నిర్మాణ దాత తుళ్లూరు కోటేశ్వరరావు–నిర్మల దంపతుల ఆధ్వర్యాన పెద్ద చెరువులో శ్రీవారి తెప్పోత్సవం నిర్వహించగా, కుర్నవల్లికి చెందిన శీలం వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యాన అన్నదానం చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, మధిర మార్కెట్ చైర్మన్ బండారు నర్సింహారావు, ఎంపీడీఓ సురేంద్రనాయక్, సొసైటీ చైర్మన్ ముల్పూరి శ్రీనివాసరావు, ఉద్యోగులు విజయకుమారి, జి.కుమార్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

రెండు ఆలయాలకు నూతన కమిటీలు

తీర్థాల, మారెమ్మ తల్లి ఆలయాలకు ఏర్పాటు

ఖమ్మంరూరల్: ఖమ్మంరూరల్ మండలం తీర్థాలలోని సంగమేశ్వర స్వామి ఆలయం, రెడ్డిపల్లిలోని మారెమ్మతల్లి ఆలయాలకు నూతన కమిటీలను నియమించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచనలతో కమిటీలను నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి శైలజారామయ్యర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సంగమేశ్వస్వామి ఆలయ చైర్మన్‌గా భూక్యా రావోజీ, సభ్యులుగా బోజెడ్ల లలితమ్మ, బండారు నాగేశ్వరరావు, మాలోత్ వెంకటేశ్వర్లు, పింగిరెడ్డి బోస్‌రెడ్డి, మద్దెల ఉప్పలయ్య, భూక్యా సేవియాను నియమించారు. అలాగే, మారెమ్మతల్లి ఆలయ చైర్మన్‌గా తిప్పిరెడ్డి వీరారెడ్డి, సభ్యులుగా కుసుమ రాజారాములు, నాగండ్ల ఉపేందర్, భట్టు చలమయ్య, చీకటి శ్రీనివాసరావు, వీర్ల వెంకటేష్, అజ్మీరా వెంకన్న, కందుల అబ్బిరెడ్డి, బానోత్ భాస్కర్, బి.కమలమ్మ, కీర్తి. లక్ష్మీనారాయణ, దండి రామారావును ఎంపిక చేశారు. ఏడాది పాటు ఈ కమిటీలు అమల్లో ఉంటాయి. ఈ సందర్భంగా కమిటీల్లో తమకు చోటు కల్పించిన మంత్రి పొంగులేటికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

11 సోలార్ మోడల్ గ్రామాల ఎంపిక

జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో నిర్ణయం

ఖమ్మంవ్యవసాయం: సంప్రదాయ వనరులను ప్రోత్సహించడంలో భాగంగా జిల్లాలో 11గ్రామాలను సోలార్ మోడల్‌గా ఎంపిక చేశారు. సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు జిల్లా స్థాయి అధికారులతో ఏర్పాటైన కమిటీ బాధ్యులు శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో సమావేశమయ్యారు. జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీపీఓ ఆశాలత, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరెడ్డి, ఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి, రెడ్‌కో మేనేజర్ పోలిశెట్టి అజయ్‌కుమార్ పాల్గొనగా.. జిల్లాలో 5వేలకు పైగా జనాభా ఉన్న రెవెన్యూ గ్రామాలను ఈ పథకం కింద ఎంపిక చేశారు. ఇందులో కల్లూరు, నేలకొండపల్లి, తల్లాడ, అన్నారుగూడెం, ఖమ్మం రూరల్ మండలం పెద్దతండా, ఏదులాపురం, కొణిజర్ల, తనికెళ్ల, ముదిగొండ, వల్లభి, వేంసూరు మండలం కందుకూరు ఉన్నాయి. ఈ గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పీఎం సూర్యఘర్, ముఫ్త్ బిజిలీ యోజన, పీఎం కుసుమ్ తదితర పథకాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు అవగాహన కల్పిస్తారు. పంచాయతీ, సహకార సంఘాలు, స్వయం సహాయక బృందాలు, ఇతర సంస్థల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. కాగా, సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు 2కిలోవాట్ల వరకు రూ.60వేలు, 3 కిలోవాట్లకు రూ.78 వేల సబ్సిడీ ప్రభుత్వం నుంచి అందుతుంది. మిగతా నగదును బ్యాంకుల నుంచి రుణంగా తీసుకునే అవకాశం కల్పిస్తారు. అంతేకాక ఇళ్లపై అత్యధికంగా సోలార్ ప్లాంట్లు ఏర్పాటైన గ్రామానికి సీఎఫ్‌ఏ(సెంట్రల్ ఫైనాన్సియల్ అసిస్టెంట్) కింద రూ.కోటి నగదు అందించి ఆ గ్రామంలోని అన్ని ప్రభుత్వ భవనాలపై సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

నవమి భక్తులకు ప్రత్యేక బస్సులు

- భద్రాచలానికి 197, అక్కడి నుండి పర్ణశాలకు 30
- హైదరాబాద్ భక్తులకు రిజర్వేషన్ కూడా..



ఖమ్మంమయూరిసెంటర్: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం, పట్టాభిషేకానికి హాజరయ్యే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ఖమ్మం రీజియన్ అధికారులు ప్రత్యేక సర్వీసులు నడిపించనున్నారు. ఈనెల 6, 7వ తేదీల్లో ఉమ్మడి జిల్లాలోని అన్ని డిపోల నుండి భద్రాచలానికి ఈ సర్వీసులు ఉంటాయి. అలాగే, హైదరాబాద్ నుండి భద్రాచలం, భద్రాచలం నుండి హైదరాబాద్‌కు సైతం బస్సులు ఏర్పాటు చేసి, రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఇవి కాక ఖమ్మం నుండి హైదరాబాద్‌కు ప్రతీ పది నిమిషాలకో బస్సు నడిపించాలని నిర్ణయించారు. ఖమ్మం రీజియన్‌లోని డిపోల నుండి భద్రాచలానికి 197 ప్రత్యేక బస్సులు, భద్రాచలం నుండి పర్ణశాలకు 30 బస్సులు నడిపించనుండగా, భక్తులు ఎలాంటి ఇబ్బంది పడకుండా రీజినల్ మేనేజర్ ఏ.సరిరామ్ నేతృత్వాన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

రోజు వారి సర్వీసులకు అదనం

భద్రాచలం నుండి హైదరాబాద్, భద్రాచలం నుండి ఖమ్మంకు రోజువారి తిరిగే వంద సర్వీసులతో పాటు అదనంగా సర్వీసులు నడిపిస్తారు. ఈనెల 6వ తేదీన అదనంగా 35సర్వీసులు, భద్రాచలం నుంచి కొత్తగూడెంకు నిత్యం తిరిగే సర్వీసులకు తోడు అదనంగా పది బస్సులు ఏర్పాటు చేయనున్నారు. అంతేకాక కొత్తగూడెం రైల్వే స్టేషన్ నుండి భద్రాచలానికి ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఈ బస్సులు నడుస్తాయి. భద్రాచలం నుండి మణుగూరుకు రోజు వారీగా తిరిగే ఎనిమిది బస్సులతో పాటు అదనంగా పది బస్సులు, సత్తుపల్లి నుండి 20 బస్సులు, మధిర నుండి 17 బస్సులు, ఇల్లెందు నుండి భద్రాచలానికి ఐదు బస్సులు నడిపించనున్నారు. ఇక ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు కేంద్రాలకే కాక భద్రాచలం నుండి హనుమకొండ, కరీంనగర్‌కు సర్వీసులు ఏర్పాటు చేయాలనే యోచనలో అధికారులు ఉన్నారు. కాగా, భద్రాచలం నుండి విజయవాడ, రాజమండ్రి, గుంటూరు, ఏలూరు, కాకినాడ, అమలాపురం వైపు వెళ్లే బస్సుల కోసం జూనియర్ కాలేజ్ మైదానంలో ప్రత్యేక పాయింట్ ఏర్పాటుచేశారు. అక్కడి నుంచి ఆలయానికి వెళ్లేందుకు రెండు బస్సులు నడిపిస్తామని అధికారులు వెల్లడించారు.

ప్రత్యేక సర్వీసుల సమాచారం కోసం ఫోన్ నంబర్లు

డిపో	సెల్ నంబర్
భద్రాచలం	99592 25987
ఖమ్మం కొత్త బస్టాండ్	99592 25979
మణుగూరు	89853 61796
కొత్తగూడెం	99592 25982

> **ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు**
>
> 
>
> శ్రీరామనవమి పురస్కరించుకుని భద్రాచలంలో స్వామివారి కల్యాణం తిలకించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు వస్తారు. రాకపోకల సమయాన ఎవరూ ఇబ్బంది పడకుండా ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఉమ్మడి జిల్లాలోని ఏడు డిపోల నుండి ప్రత్యేక బస్సులు నడిపిస్తాం. ఈనెల 6న భక్తుల కోసం అన్ని బస్టాండ్ల నుండి రద్దీకి అనుగుణంగా బస్సులు ఉంటాయి. అంతేకాక భద్రాచలం నుంచి ఖమ్మం, హైదరాబాద్‌కు రెగ్యులర్ సర్వీసులు తోడు అదనపు సర్వీసులు నడిపిస్తాం.
> – ఏ.సరిరామ్, ఆర్‌ఎం, ఖమ్మం రీజియన్

క్లుప్తంగా

పామాయిల్ ఫ్యాక్టరీపై హైకోర్టులో రిట్


తహసీల్‌లో కాపీ అందిస్తున్న రైతులు

వేంసూరు: కనీస నిబంధనలు పాటించకుండా పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మిస్తున్నారని పేర్కొంటూ కొందరు రైతులు హైకోర్టులో ఈనెల 2న రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు పిటీషన్ కాపీని బండి శ్రీనివాసరెడ్డి తదితరులు కల్లూరు ఆర్డీఓ కార్యాలయంతో పాటు వేంసూరు తహసీల్దార్ బాబ్జీప్రసాద్‌కు శుక్రవారం అందజేశారు. అనంతరం పలువురు రైతులు మాట్లాడుతూ వేంసూరు మండలం కల్లురుగూడెంలోని 42 ఎకరాల్లో రూ.87 కోట్ల పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి ఉగాది రోజున మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే మట్టా రాగమయి తదితరులు శంకుస్థాపన చేశారు. అయితే, ఫ్యాక్టరీ ఏర్పాటుతో గ్రామంలోని సామూహిక పట్టా భూమి కోల్పోవడమే కాక ఫ్యాక్టరీ నుంచి వచ్చే కాలుష్యంతో అనారోగ్యం పాలవుతామని, భూగర్భ జలాలు అడుగంటనున్నందున ఫ్యాక్టరీ నిర్మాణాన్ని నిలిపివేయించాలని పిటీషన్‌లో కోరినట్లు తెలిపారు. ఈమేరకు ఐదుగురు రైతులు పిటీషన్ దాఖలు చేసినట్లు తెలిపారు.

మెడిసిన్ విద్యార్థినికి చేయూత



ప్రీతికి చెక్కు అందిస్తున్న రామారావు

కల్లూరు: ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్న మెడిసిన్ విద్యార్థినికి స్ఫూర్తి ఫౌండేషన్ తరఫున చేయూతనందించారు. టేకులపల్లికి చెందిన శిరసాని ఇమ్మానియేల్ కుమార్తె ప్రీతి హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో మెడిసెన్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ఆమె కుటుంబ పరిస్థితి బాగుండకపోవడంతో హాస్టల్ ఫీజు ఇతర అవసరాలకు ఇబ్బంది పడుతున్నట్లు స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి వరకా రామారావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన దాతల సాయంతో శుక్రవారం రూ.85 వేల చెక్కు అందచేశారు.

ప్రభుత్వ కేంద్రాల్లోనే మద్దతు ధర


ధాన్యం కొనుగోళ్లను ప్రారంభిస్తున్న రాయల

ముదిగొండ: రైతులు తాము సాగు చేసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వ కేంద్రాల్లోనే విక్రయించాలని, తద్వారా మద్దతు ధరతో పాటు సన్న ధాన్యానికి బోనస్ లభిస్తుందని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తెలిపారు. ముదిగొండ మండలం వల్లభి, మల్లారం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు, వల్లభిలో స్త్రీ టీ సెంటర్, మల్లారంలో సన్నబియ్యం పంపిణీని ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ జిల్లా, మండల అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రమేష్‌బాబు, సీసీ రామారావుతో పాటు బిచ్చాల బిక్షం, ఇలవల పుల్లారెడ్డి, బిచ్చాల అన్వేష్, తదితరులు పాల్గొన్నారు.

పార్క్‌లో మంటలపై అటవీశాఖ, పోలీసుల ఆరా

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని వెలుగుమట్ల అర్బన్ అటవీ పార్క్‌లో గురువారం రాత్రి మంటలు చెలరేగిన ఘటనపై శుక్రవారం అటవీశాఖ, పోలీసు అధికారులు ఆరా తీశారు. పార్క్‌ను ఆనుకుని ఉన్న పొలాల్లో రైతులు చెత్తకుప్పలకు నిప్పంటించడంతో మంటలు వచ్చాయా, ఇతర కారణాలు ఉన్నాయా అనే సమాచారం సేకరిస్తున్నారు. ఖమ్మం ఏసీపీ రమణమూర్తి, ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్ పార్క్‌ను పరిశీలించగా, అటవీశాఖ ఎఫ్‌ఆర్‌ఓ నాగేశ్వరరావు కూడా మంటల ధాటితో ఎన్ని మొక్కలు కాలిపోయాయనే అంశంపై ఆరా తీశారు. మంటలకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు అటవీశాఖ అధికారులు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,300	5,600
కందులు	6,550	6,550
మిర్చి	13,300	5,500
మిర్చి తాలు	5,000	4,800
పత్తి	7,300	6,400

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.20,871

కర్షకుల కళ్లలో కన్నీళ్లు

ఆకాల వర్షంతో పంటలకు నష్టం

అనుకోని వర్షం అన్ని పంటలను దెబ్బకొట్టింది.. మండే వేసవిలో కురిసిన అకాల వర్షం అపార నష్టాన్ని మిగిల్చింది. ఆరుగాలం శ్రమించి.. ఇక పంట చేతికి వస్తుందనుకున్న రైతుల ఆశలపై నీళ్లు కుమ్మరించింది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఆకాలంగా వచ్చిన వాన అన్నదాతల కంట కన్నీళ్ల వరదలు పారించింది. జిల్లాలోని తిరుమలాయపాలెం, వైరా, తల్లాడ, ఏన్కూరు, కల్లూరు, కామేపల్లి, కొణిజర్ల, కూసుమంచి మండలాల్లో గురువారం అర్ధరాత్రి, శుక్రవారం సాయంత్రం వర్షప్రభావం కనిపించింది. ఆతర్వాత కూడా ఆకాశం మేఘావృతమై ఉండగా, పంటలు రక్షించేందుకు రైతులు జాగ్రత్తల్లో నిమగ్నమయ్యారు.


తిరుమలాయపాలెం : ఎదుళ్లచెరువులో తడిసిన మొక్కజొన్నలు ఆరబోస్తున్న రైతులు (ఇన్‌సెట్) తల్లాడ : రాలిపోయిన మామిడి కాయలు


వైరా : పట్టాలపై నిలిచిన నీరు తొలగిస్తున్న రైతు


తిరుమలాయపాలెం : మిర్చి కల్లంలోకి చేరిన వర్షపు నీరు


తల్లాడ : బిల్లుపాడులో నేల వాలిన వరి పైరు

మనోళ్లే ఇచ్చేయండి..

- కొందరికే కేఎంసీ పనుల అప్పగింత
- టెండర్ పెట్టాల్సి వచ్చినా వారి వైపే మొగ్గు
- ఆపై హడావుడిగా బిల్లులు చెల్లింపు
- సీరియల్ కేటాయించాలని కమిషనర్ నిర్ణయం?

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో అధికారుల తీరు విమర్శలకు తావిస్తోంది. ఇటీవల ప్రతీ పనిని అత్యవసరంగా చూపించి బిల్లులు డ్రా చేస్తుండడం ఇందుకు కారణమవుతోంది. శానిటేషన్ విభాగానికి సంబంధించి పెద్ద మొత్తంలో ఖర్చు అయ్యే పనులను కూడా విభజించి నామినేషన్ పద్ధతిపై కాంట్రాక్టర్లకు అప్పగిస్తుండడం.. అదీ కొందరికే ఇస్తుండడంపై కేఎంసీలో చర్చ జరుగుతోంది. అధికారులు కావాలనే నామినేషన్ పద్ధతిలో, ఓచర్ విధానంలో పనులు చేయిస్తున్నారని.. టెండర్లు ఆహ్వానించకుండా కానిచ్చేస్తున్నారని తెలిసింది. అంతేకాక పనులు కాగానే బిల్లుల చెల్లింపునకు హడావిడి చేస్తున్నారని సమాచారం.

ఒకరికేనా పనులన్నీ..

కేఎంసీ పరిధిలో పదుల సంఖ్యలో కాంట్రాక్టర్లు ఉన్నారు. సివిల్ వర్క్స్ మొదలు కార్మికులను ఏర్పాటు చేయడం, పారిశుద్ధ్య పనుల నిర్వహణ, వాహనాలు సమకూర్చడం, యంత్రాల మరమ్మతు తదితర పనులు చేస్తూ ఉంటారు. కానీ ఇటీవల అందరినీ పక్కన పెట్టిన అధికారులు తమకు అనుకూలంగా ఉన్న ఒకరిద్దరికే అప్పగిస్తున్నారనే చర్చ జరుగుతోంది. శానిటేషన్ విభాగంలో కీలక పనులన్నీ ఒకే కాంట్రాక్టర్‌కు అప్పగిస్తుండడం.. ఇందుకు ఓ కీలక అధికారి సహకరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆయనకు పనులు ఇచ్చేలా పెద్ద మొత్తంలో వెచ్చించాల్సిన పనులను సైతం రెండు, మూడుగా విభజిస్తున్నారని సమాచారం. టెండర్ ద్వారా పనులు చేయిస్తే ఎంబీల్లో రికార్డు చేయాల్సి ఉంటుందని, తద్వారా బిల్లుల చెల్లింపుల్లో ఇబ్బందులు ఉంటాయని ఈ విధానం అవలంబిస్తున్నట్లు తెలిసింది. దీంతో సదరు కాంట్రాక్టర్ పెత్తనం కేఎంసీలో పెరిగిందని, అధికారులనే దబాయించే స్థాయికి వెళ్లారని కార్యాలయ ఉద్యోగులు చెబుతున్నారు.


అనుకూలమైన వ్యక్తులకే..

చిన్న పనులను నచ్చిన వ్యక్తులకు అప్పగిస్తున్న అధికారులు.. పెద్ద పనులకు టెండర్లు ఆహ్వానించినా చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల రూ.75 లక్షల పనులకు సంబంధించిన ఓ పనికి టెండర్లు పిలవగా, ముగ్గురు కాంట్రాక్టర్లు దరఖాస్తు చేశారు. ఈ ముగ్గురిలో తమకు నచ్చిన వ్యక్తికే కాంట్రాక్ట్ దక్కేలా మిగిలిన ఇద్దరి సర్టిఫికెట్లపై కావాలనే ఫిర్యాదు చేయించి పక్కకు తప్పించారని తెలిసింది. అధికారులకు అనుకూలమైన వ్యక్తికి లైసెన్సు లేకున్నా వేరే కాంట్రాక్టర్ లైసెన్సు ద్వారా టెండర్ వేయించి, ఆయనకు పనులు అప్పగించారని సమాచారం.

పెరుగుతున్న ఓచర్ చెల్లింపులు

ఖమ్మం నగర పాలకసంస్థలో రూ.5లక్షల లోపు పనులైతే అధికారులు నామినేషన్ పద్ధతిన చేయిస్తారు. అంత కంటే విలువైన పనులపై టెండర్లు నిలుస్తారు. కానీ ఇటీవల నామినేషన్ పద్ధతిలో చేపడుతున్న పనులకే కాక ఇతర పనులకూ ఓచర్ విధానంలో చెల్లింపులు చేస్తున్నట్లు సమాచారం. శానిటేషన్ అధికారులు, సిబ్బంది చిన్నచిన్న పనులు ఉన్నాయని, మరమ్మతులు చేయించాలని చెబుతూ కమిషనర్ వద్ద నోట్ ఫైల్ తీసుకొని బిల్లులు చెల్లిస్తున్నారని తెలిసింది. ఇది తప్పు కాకున్నా పనులన్నీ ఒకరే చేయడం అనుమానాలకు తావిస్తోంది.

ఇక రొటేషన్ పద్ధతిలో..

కేఎంసీ పరిధిలో గత మూడు నెలల కాలంలో చేపట్టిన పనులు, సమర్పించిన బిల్లులపై కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆరా తీస్తున్నట్లు తెలిసింది. బిల్లులు, వాటి తాలుకా పనుల నివేదికలను తనకు సమర్పించాలని ఆదేశించినట్లు సమాచారం. వీటిని పరిశీలించాక కమిషనర్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అంతేకాక ఇక నుండి నామినేషన్ పద్ధతిలో ఇచ్చే పనులకు రొటేషన్ విధానంలో కాంట్రాక్టర్లకు గుర్తించాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం. కాంట్రాక్టర్లకు సీరియల్ నంబర్లు కేటాయించి ఒకరి తర్వాత మరొకరికి పనులు కేటాయించేలా త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేస్తారని తెలిసింది.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

మధిర: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడిన ఓ వ్యక్తి మృతి చెందాడు. ఏపీలోని పల్నాడు జిల్లా గురజాల మండలానికి చెందిన గడ్డం మహేశ్వరరావు(45) శుక్రవారం రైలులో ప్రయాణిస్తుండగా తొండల గోపవరం – మధిర రైల్వేస్టేషన్ల మధ్య జారిపడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందగా మృతదేహాన్ని దోర్నాల రామకృష్ణ ఆధ్వర్యంలో మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు జీఆర్పీ ఔట్‌పోస్ట్ ఇన్‌చార్జ్ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల సీజ్

తిరుమలాయపాలెం: మండలంలోని కాకరవాయి శివారు పాలేరు ఏటి నుండి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శుక్రవారం పోలీసులు సీజ్ చేశారు. మోతె మండలానికి చెందిన వ్యక్తులు రెండు ట్రాక్టర్లలో ఇసుక తీసుకెళ్తుండగా కాకరవాయి సెంటర్‌లో అడ్డుకున్నారు. ఈమేరకు వాహనాలను పోలీస్‌స్టేషన్‌కి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కూచిపూడి జగదీష్ తెలిపారు.

ఆటో బోల్తా పడడంతో పలువురికి గాయాలు

వేంసూరు: ఏపీలోని ఏలురు జిల్లా చింతలపూడి మండలం వెలగలపల్లి వద్ద జరిగిన ప్రమాదంలో వేంసూరు మండలం దుద్దెపూడికి చెందిన 10మంది మహిళా కూలీలు గాయపడ్డారు. అక్కడి మొక్కజొన్న ఫ్యాక్టరీలో పనిచేసేందుకు గురువారం వెళ్లిన వారు శుక్రవారం ఉదయం తిరిగి ట్రక్ ఆటోలో వస్తుండగా ఆటో పంక్చర్ అయింది. ఈమరకు వాహనం అదుపు తప్పి ఆంథోని నగర్ వద్ద బోల్తా పడడంతో 9మందికి స్వల్ప గాయాలు కాగా, కనపర్తి లక్ష్మి తీవ్రగాయాలు కావడంతో ఏలూరు ఆస్పత్రికి తరలించారు.

బఫర్‌జోన్‌లో నిర్మాణాలపై సర్వే

అలుగువాగు పరీవాహకంలో ఆక్రమణల గుర్తింపుపై దృష్టి

ఖమ్మంఅర్బన్: వరద ముంపు ఎదురుకాకుండా మురుగునీరు సాఫీగా సాగేలా ఖమ్మంలోని ఖానాపురం అలుగు వాగు సమీపాన రూ.290 కోట్ల అంచనా వ్యయంతో పైపులైన్ పనులు చేపడుతున్నారు. వాగుకు ఇరువైపుల కాలనీల నుంచి మురుగు నీటిని ఈ పైపులైన్ ద్వారా తరలించడంతో పాటు శుద్ధిచేసేలా ప్లాంట్లు సైతం నిర్మించనున్నారు. ఈక్రమంలోనే వాగు రికార్డుల ప్రకారం ఎంత మేర విస్తీర్ణంలో ఉండాలనే అంశాన్ని తేల్చేందుకు సర్వే చేపట్టారు. సుమారు 9కి.మీ. మేర ప్రవహించే వాగు సమగ్ర రూపాన్ని సర్వే చేసేందుకు మూడు బృందాలను ఏర్పాటుచేశారు. రెండు రోజులుగా ఇరిగేషన్, రెవెన్యూ, కార్పొరేషన్ ఉద్యోగులతో కూడిన ఈ బృందాలు సర్వే చేస్తున్నారు. వాగుకు ఇరువైపులా బఫర్‌జోన్‌లో ఎన్ని ఆక్రమణలు ఉన్నాయి, అందులో పేదల ఇళ్లు ఎన్ని, ఎన్ని ఇళ్లలో నివాసం ఉంటున్నారనే వివరాలు ఆరా తీస్తుండగా, పది రోజుల్లో నివేదిక సిద్ధం చేయనున్నట్లు తెలిసింది.


బఫర్‌జోన్‌లో నిర్మాణాలను పరిశీలిస్తున్న ఉద్యోగులు

రేషన్ బియ్యం అందిస్తున్న ఘనత బీజేపీదే..

మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు

ఖమ్మంమామిళ్లగూడెం: కరోనా కాలం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 90 లక్షల కుటుంబాలకు ఉచితంగా బియ్యం అందిస్తున్న ఘనత బీజేపీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వానికే దక్కుతుందని పార్టీ రాష్ట్ర క్రమశిక్షణా సంఘం చైర్మన్, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు తెలిపారు. మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతి ఉత్సవాల సందర్భంగా ఖమ్మంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వం నిధులతో సరఫరా చేసే రేషన్ బియ్యానికి కిలో కలిపి రాష్ట్రప్రభుత్వం తమ ఘనతగా చెప్పుకుంటోందని ఎద్దేవాచేశారు. కాగా, కాంగ్రెస్ నియంతృత్వ పాలనను చూస్తున్న ప్రజలు పొరపాటున పట్టం కట్టామని ఆందోళన చెందుతున్నారన్నారు. రాబోయే రోజుల్లో ఆ పార్టీకి ప్రత్యామ్నాయంగా బీజేపీ నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావుతో పాటు నాయకులు సన్నే ఉదయ్ ప్రతాప్, గెంటేల విద్యాసాగర్, నున్నా రవి, కూసంపూడి రవీందర్, ఈ.వీ.రమేష్, వేల్పుల సుధాకర్, విజయ్‌రాజ్, చింతమళ్ల వీరస్వామి, తాటికొండ రవి, కొదుమూరి రాజయ్య, తక్కెళపల్లి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారావు

రహదారి విస్తరణలో ఇళ్ల కూల్చివేత

బాధితులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 60వ డివిజన్ రామన్నపేటలో రోడ్డు విస్తరణ పనులకు అడ్డుగా ఉన్న ఇళ్లను కూల్చివేయడాన్ని శుక్రవారం మొదలుపెట్టారు. ఈక్రమంలో నిర్వాసితులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. రైల్వే మూడో లైన్ నిర్మాణంలో భాగంగా ఖమ్మం – కామంచికల్లు మధ్య ప్రధాన రహదారి స్థలాన్ని సేకరించారు. దీంతో రహదారిని విస్తరించాల్సి రావడంతో 42 ఇళ్లుగా ఉన్నాయని ఏడాది క్రితమే గుర్తించిన అధికారులు చదరపు గజానికి రూ.6,200లే కాక నిర్మాణాలు, చెట్లకు సైతం పరిహారం అందించారు. కానీ తాము అంత్యంత విలువైన స్థలాలు కోల్పోయినందున ప్రత్యామ్నాయ స్థలం చూపాలని 15 మందికిపైగా కోరడంతో రెవెన్యూ అధికారులు స్థలం ఎంపిక చేశారు. కానీ ఆ స్థలం నచ్చలేదని చెప్పడంతెట ఏడాదిగా సమస్య కొనసాగుతోంది. ఈనేపథ్యాన శుక్రవారం భారీ పోలీసు బందోబస్తు మధ్య రెవెన్యూ, ఆర్‌అండ్ శాఖ అధికారులు వాహనాలతో చేరుకుని కూల్చివేత పనులు చేపట్టారు. ఈక్రమంలో కొందరు వాహనాలను అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొనగా.. వారిని వాహనాల్లో తరలించి కూల్చివేత కొనసాగించారు. అర్బన్ తహసీల్దార్ రవికుమార్, డీటీ వెంకటేశ్వరరావు, ఆర్‌ఐలు వహీద్, నరేశ్, ఖానాపురం హవేలి సీఐ భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.


అడ్డుకుంటున్న వారిని తీసుకెళ్తున్న పోలీసులు

అందరూ ఐకమత్యంతో ఉండాలి..

'ఈద్ మిలాప్'లో మాజీ మంత్రి పువ్వాడ

ఖమ్మం మామిళ్లగూడెం: ముస్లింలు ఐకమత్యంగా ముందుకు సాగాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కోరారు. ఖమ్మం షాదీఖానాలో శుక్రవారం ఏర్పాటుచేసిన ఈద్ మిలాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఏ మతమైనా అందరి మంచినే కోరుకుంటుందని తెలిపారు. ఈవిషయాన్ని గుర్తించి అందరూ సమాజాభివృద్ధిలో పాలుపంచుకోవాలని, అన్ని మతాల వారు ఎదుటివారి సంప్రదాయాలను గౌరవించాలని కోరారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎండీ.ఖమర్, కార్పొరేటర్లు, నాయకులు కర్నాటి కృష్ణ, షేక్ మగ్బూల్, కూరాకుల వలరాజు, కోటేశ్వరావు, జ్యోతిరెడ్డి, షంసుద్దీన్, ముజాహిద్, ఫిరోజ్, ఇజార్, ఛోటు, మున్నా, చంటి, పగడాల నాగారాజు, విజయ్‌కుమార్, ఎండీ.తాజుద్దీన్, న్యాయవాదులు కొల్లి సత్యనారాయణ, ఎం.డీ.తౌఫిక్, సీపీఎం, సీపీఎం నాయకులు నాగుల్‌మీరా, సీపీఐ నాయకులు షేక్ జానీమియా, అబ్దుల్ ఘనీ, సుధాకర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి అజయ్‌కుమార్

రైతులకు గుర్తింపు కార్డులు

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలంలో కూరగాయలు సాగు చేస్తూ ఖమ్మం రైతుబజార్‌లో విక్రయించే రైతులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనలతో గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు తెలిపారు. మండలంలోని రైతులకు ఆయన శుక్రవారం కార్డులు పంపిణీ చేశాక మాట్లాడారు. అర్హులైన రైతులకు కార్డులు జారీ చేయడం ద్వారా, రైతుబజార్‌లోకి దళారులు రాకుండా అడ్డుకట్ట వేయనున్నామని తెలిపారు. ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, రఘునాథపాలెం సొసైటీ చైర్మన్ తాత రఘురాంతో పాటు శివ రామకృష్ణ, వాంకుడోత్ దీప్లానాయక్, చెరుకూరి పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


కార్డులు అందుకున్న రైతులతో చైర్మన్, తదితరులు

ఉచిత కోచింగ్‌ను వినియోగించుకోండి

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఇస్తున్న ఎప్‌సెట్ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు సూచించారు. తెలిపారు. ఖమ్మంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఉచిత శిక్షణను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రంగంలోకి జటాయు !

ఖమ్మంమయూరిసెంటర్: రోడ్లు, రోడ్ల వెంట పోగు చేసిన చెత్తను ఎత్తేందుకు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు జటాయు(వాక్యూమ్ మెషిన్లు) కొనుగోలు చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.55 లక్షల చొప్పున వెచ్చించి రెండు మెషిన్లను కొనుగోలు చేయగా.. వీటి వినియోగంపై సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. పుణే నుండి వచ్చిన సాంకేతిక నిపుణులు మెషిన్ పనితీరు, వినియోగంపై ఇక్కడి కార్మికులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈమేరకు శుక్రవారం ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రం రోడ్డులో కుప్పలు చేసిన చెత్తను మెసిన్ ద్వారా ఎత్తారు. చెత్త కుప్పల వద్ద మెషిన్ పైపును ఉంచగా.. సక్షన్ పవర్‌తో పైపు ద్వారా వాహనంలోకి లాగేసుకుంది. ఈ జటాయు మెషిన్ ద్వారా రోడ్లపై చెత్త, చిన్నచిన్న రాళ్లు, కొబ్బరి బోండాలు, చిప్పలు, కాగితాలు, ఆకులను సులభంగా తొలగించవచ్చని చెబుతున్నారు. ఈమేరకు యంత్రాలను వినియోగించాల్సిన ప్రాంతాలపై రూట్‌మ్యాప్ సిద్ధం చేస్తున్న అధికారులు డ్రైవర్, కార్మికులను కేటాయించనున్నారు.


జటాయుతో చెత్త సేకరిస్తున్న సిబ్బంది

గంజాయి స్వాధీనం

ఖమ్మంక్రైం: విద్యార్థులు, యువతకు గంజాయి సరఫరా చేసే ఓ వ్యక్తిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్–1 పోలీసులు తెలిపారు. సీఐ కృష్ణ ఆధ్వర్యాన చేపట్టిన తనిఖీల్లో ఖమ్మం చర్చి కాంపౌండ్ ప్రాంతానికి చెందిన నాగుల హనోక్ తన ద్విచక్రవాహనంలో గంజాయి తీసుకెళ్తూ పట్టుబడ్డారని పేర్కొన్నారు. ఈమేరకు ఆయన నుంచి 650గ్రాముల గంజాయి, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

టేకులపల్లి వద్ద...

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని నగరంలోని టేకులపల్లి డబుల్ బెడ్‌రూం సముదాయానికి వాహనంపై వచ్చిన ఓ వ్యక్తి గంజాయి అమ్ముతున్నాడనే సమాచారంతో ఖమ్మం అర్బన్ ఎస్సై శ్రావణ్‌కుమార్ శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా 85గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని ఎస్.నాగేశ్వరరావును అదుపులోకి తీసుకున్నట్లు సీఐ భానుప్రకాశ్ తెలిపారు. ఈ ఘటనలో నాగేశ్వరరావుతో పాటు ఆయన గంజాయి అందిన ఇద్దరిపైనా కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మార్చురీలో ఉన్న రెండు అనాథ మృతదేహాలకు అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు నేతృత్వాన శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. బోనకల్ రైల్వేస్టేషన్ మృతి చెందిన ఒకరు, ముదిగొండ మున్నేరులో లభించిన గుర్తు తెలియని వ్యక్తుల మృతదేహాలను మార్చురీలో భద్రపర్చారు. ఇప్పటివరకు ఎవరూ రాకపోవడంతో పోలీసుల సమాచారం మేరకు అన్నం ఫౌండేషన్ చైర్మన్, సభ్యులు శుక్రవారం అంత్యక్రియలు పూర్తిచేశారు.


మార్చురీ వద్ద మృతదేహాలతో శ్రీనివాసరావు, తదితరులు